సాక్షి
మంచిర్యాల

బుధవారం, 11, అక్టోబర్, 2023



పండుగకు ప్రత్యేక బస్సులు

దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక బస్సులు నడిపించనుంది. రీజియన్ నుంచి 443 బస్సులు నడవనున్నాయి. 10లో▸



ఎన్నికల నియమావళి షురూ

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. మండలాల్లో నియమావళికి విరుద్ధంగా ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలు తొలగించారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మిషన్ ఇంద్రధనుష్ పరిశీలన



వివరాలను తెలుసుకుంటున్న వరిషా

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఈ నెల 9నుంచి 14వరకు నిర్వహిస్తున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని నేషనల్ అబ్జర్వర్ మిషన్ ఇంద్రధనుష్ డాక్టర్ వరిషా మేరియమ్ మంగళవారం పరిశీలించారు. దండేపల్లి మండలం ముత్యంపేట్, రెబ్బనపల్లి, మంచిర్యాలలోని రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీ ఏరియాలోని తిలక్‌నగర్, నస్పూరు మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయి టీకాలు వేశారా లేదా అని ఆరా తీశారు. వ్యాక్సిన్‌లు వేసుకోని చిన్నారులు, గర్భిణుల కోసం ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవినాయుడు, సంతోష్, వ్యాక్సిన్ కోల్డ్‌స్టోరేజీ మేనేజర్ అఖిల్‌పాషా, సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ కరీంనగర్ యూనిట్ డాక్టర్ అతుల్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతర నిఘా



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ

కోటపల్లి: త్వరలో ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘా ఉంటుందని ఏసీపీ మోహన్ అన్నారు. మంగళవారం రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నది వంతెనపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తెలంగాణ ప్రాంతంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తే సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, ఎస్సైలు సురేశ్, సుబ్బారావు పాల్గొన్నారు.

బదిలీలు అయినట్లా..? కానట్లా..?

- భాషాపండితుల ఆవేదన
- 19 మంది పాత బడుల్లోనే విధులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా వాయిదా వేసిన స్కూల్ అసిస్టెంట్ భాషా పండితులు, పీఈటీల బదిలీలు సోమవారం పూర్తయ్యాయి. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల నుంచి మరోచోటికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఎస్‌ఏ(హిందీ) నలుగురు, ఎస్‌ఏ తెలుగు ముగ్గురు, లోకల్‌బాడీ పాఠశాలలకు సంబంధించి ఎస్‌ఏ హిందీ 19 మంది, ఎస్‌ఏ తెలుగు 22 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) 8 మంది బదిలీ అయ్యారు. ఇందులో తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల్లో కొందరికే స్థాన చలనం కలిగింది. మరొకరు వచ్చినప్పుడే రిలీవ్ చేయాలనే నిబంధన కారణంగా బదిలీ అయినా పాత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తించే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులో ఎస్‌ఏ హిందీ ఉపాధ్యాయుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఒక్కరూ కదలకపోవడం విస్మయం కలిగిస్తోంది. జిల్లాలో మొత్తం ఎస్‌ఏ హిందీ 40 పోస్టులు కాగా 25 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకా 15 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. 25మందిలో 19 మంది ఉపాధాయులు మాత్రమే బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. ఒకరు వస్తే గానీ మరొకరిని రిలీవ్ చేయరాదనే నిబంధనతో పాత పాఠశాల్లోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. నిబంధనలు సడలించి బదిలీ స్థానాలకు పంపించాలని కోరుతున్నారు.



అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో తరుణ్‌చుగ్, ఈటల, కిషన్‌రెడ్డి, బాపూరావు, సంజయ్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్‌శంకర్, రమాదేవి తదితరులు

జనగర్జన జోష్..

- ఎన్నికల కదనరంగంలోకి కమలదళం
- యుద్ధం ప్రారంభించండి.. అంటూ నేతల పిలుపు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలతో సాగిన అమిత్‌షా ప్రసంగం
- బీజేపీని గెలిపించాలంటూ రాష్ట్ర నేతల పిలుపు
- జనం నుంచి పాజిటివ్ రెస్పాన్స్..
- పార్టీ శ్రేణులు, నేతల్లో ఉత్సాహం
- ఆదిలాబాద్ సభ సక్సెస్





↑ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



సభకు తరలివస్తున్న జనం →

సాక్షి, ఆదిలాబాద్ /ఆదిలాబాద్ టౌన్: ఎన్నికల షెడ్యూల్ తర్వాత బీజేపీ రాష్ట్రంలో తొలిసారిగా తలపెట్టిన జనగర్జన బహిరంగ సభ సక్సెస్ అయింది. ఈ సభతోనే కమలదళం ప్రచారం షురూ చేసింది. యుద్ధం ప్రారంభించండి అంటూ నేతలు పిలుపునిచ్చారు. సైరన్ మోగిందని.. ముందుకు కదలాలన్నారు. ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీఆర్‌ఎస్ సర్కారు తీరుపై విమర్శిస్తూ, కాంగ్రెస్ హయాంలో యూపీఏ సర్కార్ అవినీతిని ఎండగడుతూ షా ప్రసంగం సాగింది. డిసెంబర్ 3న రాష్ట్రంలో కమలం సర్కార్‌ను తీసుకొద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు.

భారీగా తరలివచ్చిన జనం..

ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో మంగళవారం బీజేపీ జనగర్జన సభ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల పరిధి నుంచి జనాన్ని సమీకరించారు. సుమారు 45వేల వరకు తరలి రావడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, పడకంటి రమాదేవి, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనం ఉత్సాహం..

సభకు భారీగా జనం తరలిరావడంతో హోం మంత్రి తో పాటు జాతీయ, రాష్ట్రనేతల్లో ఉత్సాహం కనిపించింది. షా ప్రసంగం సమయంలో ప్రజలను ప్రశ్నించడం, దానికి వారు ఉత్సాహంగా స్పందించడం ఆకర్షించింది. కేసీఆర్ సర్కార్ మళ్లీ రావాలా.. అని ఆయన ప్రశ్నించినప్పుడు వద్దు అని జనం అనడం గమనార్హం. అలాగే మోదీ నేతృత్వంలో కమలం పార్టీ ఇక్కడ అధికారంలోకి రావాలా అని అడిగినప్పుడు రావాలి అంటూ స్పందించారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగ సమయంలోనూ జనం నుంచి స్పందన కనిపించింది. సంజయ్ మాట్లాడుతున్నప్పుడు జనం హోరెత్తారు. ఆయన మాట్లాడిన ప్రతీ అంశానికి సభ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. గంట పాటు సభలో ఉన్న షా సాయంత్రం 4 గంటలకు ఇక్కడినుంచి తిరిగి వెళ్లారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు..

అమిత్‌షా మధ్యాహ్నం 3 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మీదుగా హెలిక్యాప్టర్ ద్వారా ఆదిలాబాద్ చేరుకున్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో దిగి రోడ్డు మార్గంలో సభ ప్రాంగణానికి చేరుకున్నారు. వేదికపై షా ఆసీనులైన తర్వాత ఎంపీ సోయం, సంజయ్, కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత అమిత్‌షా ప్రసంగించారు. బీఆర్‌ఎస్ సర్కార్ తీరును ఎండగడుతూ.. రాష్ట్రంలో డిసెంబర్ 3న కమలం సర్కార్ ఏర్పడబోతుందని ధీమా వ్యక్తం చేశారు. యూపీఏ సర్కార్ హయాంలో లక్షల కోట్ల అవినీతిని ఎండగడుతూ, ప్రస్తుతం ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ నాయకులు జనాల్లోకి వచ్చి ఏదో చేస్తామని చెబుతున్నారని షా విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్‌ఎస్ సర్కార్ కొనసాగుతుందని చెబుతూ ఇవాల్టి రజాకారుల పాలన నుంచి బీజేపీతోనే రక్షణ అంటూ ఆ నేతలు చెప్పుకొచ్చారు.

24 గంటల కరెంటిస్తే పదవికి రాజీనామా చేస్తా



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని, రైతుల బాధలు తీరుతాయని అనుకున్నాం. అమరుల త్యాగాల పునాదిపై తెలంగాణ ఏర్పడితే కేసీఆర్ కుటుంబం ఒక్కటే పదవులను అనుభవిస్తుంది. 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుంది. 9 గంటలు కూడా సరఫరా కావడం లేదు. 24 గంటల పాటు కరెంటు ఇస్తే నా పదవికి రాజీనామా చేస్తా. కేసీఆర్‌ను బొంద పెట్టేంత వరకు ప్రజలు నిద్రపోవద్దు. హైదరాబాద్‌లో నిర్మించే రింగ్ రోడ్డు రూ.7,600 కోట్లకు అమ్ముకున్నాడు. సక్రమంగా రైతుబంధు కూడా అమలు కావడంలేదు. జనాభాలో ఒక శాతం లేని వారు పదవులు అనుభవిస్తున్నారు.

– ఈటల రాజేందర్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్

కేసీఆర్ నుంచే భాష నేర్చుకున్నా..



ముఖ్యమంత్రి కేసీఆర్ నా గురువు. ఆయన నుంచే భాష నేర్చుకున్నా. సీఎం సార్ కొద్ది రోజుల నుంచి కనిపించడం లేదు. ఆయనకు ఏమైంది. ఆయన నిండు నూరేళ్లు సల్లగా ఉండాలె. ఆయన కొడుకు ఆయనకు ఏం చేస్తుండో తెలియాలి. ఆయనకు రక్షణ కల్పించండి. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారు. దీనికి ముఖ్యమంత్రే బాధ్యత వహించి రాజీనామా చేయాలి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఆచరణకు నోచుకోని హామీలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయి. బీజేపీ మతతత్వ పార్టీ కాదు.. రాష్ట్ర ప్రభుత్వం భైంసాలో పీడీయాక్ట్‌లు నమోదు చేయించింది. హిందువులపై దాడులు చేస్తే సహించేది లేదు. ఎంఐఎం లుచ్చా పార్టీ.. వారి బట్టలు తీసి ఊరేగిస్తాం. పాకిస్తాన్ జై అనే వారిని పాతిపెడతాం.

– బండి సంజయ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

అధికారంలోకి రావడం ఖాయం



రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లింది. ఆదిలాబాద్–నాగ్‌పూర్, ఆదిలాబాద్–హైదరాబాద్ వరకు రైల్వేమార్గం ఏర్పాటు కోసం ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలో రైల్వేలైన్ పనులు ప్రారంభమవుతాయి. రూ.5వేల కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో పిట్‌లైన్ పనులు జరుగుతున్నాయి. –సోయం బాపురావు, ఆదిలాబాద్ ఎంపీ

సీఎం ఫామ్‌హౌస్‌కే పరిమితం



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అవుతున్నారు. ఆదిలాబాద్ జనగర్జన సభలోని నినాదాలు కేసీఆర్‌తో పాటు దారుస్సలామ్‌లో ఉన్న ఎంఐఎం నాయకులకు వినిపించాలి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలి.

– కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

తొలిరోజే ఎమ్మెల్యే నిలదీత

దండేపల్లి: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో భూమి పూజలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను పక్కన పెట్టిన మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మంగళవారం నుంచే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని రఘుగూడెం, పర్దానిగూడ, మొకాశిగూడ, నంబాల గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కోడ్ అమల్లోకి వచ్చిన మరుసటి రోజు నుంచే తొలి ప్రచారం నిర్వహించారు. పర్దానిగూడెం వద్ద పలువురు మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. 'ఏం జేశావని వచ్చావ్.. ఐదేండ్ల కొకసారే గుర్తుకు వస్తమా.. మా ఊళ్లో రోడ్డు సరిగా లేదు.. డ్రెయినేజీ సక్కగా లేదు.. డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇత్తంటివి.. ఇళ్లు ఏవి..' అంటూ నిలదీశారు. ప్రచారం ప్రారంభించిన తొలిరోజే ఎమ్మెల్యేకు చేదు అనుభవం ఎదురవడంతో అవాక్కయ్యారు. ఎమ్మెల్యే, పార్టీ నాయకులు నచ్చజెప్పి వెళ్లిపోయారు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళలు

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- జిల్లాలో 24గంటలూ నిఘా
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు పకడ్బందీగా నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల, 10న నామినేషన్లకు చివరి తేదీ, 13న పరిశీలన, 15న ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న లెక్కింపు ఉంటాయని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వరకు అమల్లో ఉంటాయని వివరించారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి, ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తుందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలకు ఎన్నికల శిక్షణ ఇస్తామని, నియోజకవర్గానికి మూడు చొప్పున చెక్‌పోస్టుల వద్ద స్టాటిస్టికల్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 24గంటలు నిఘా ఉంచుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి సంతోష్

జిల్లాలో 6,17,901 మంది ఓటర్లు

జిల్లాలో 6,17,901 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 3,08,630 మంది, స్త్రీలు 3,09,229 మంది, ఇతరులు 42 మంది ఉన్నారని కలెక్టర్ సంతోష్ తెలిపారు. 10,192 మంది దివ్యాంగ ఓటర్లు, 7,612 మంది వయోవృద్ధులు, ఎన్‌ఆర్‌ఐ 29 మంది, 627 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు ఈసారి ఇంటి నుంచే ఓటు వేసే హక్కు కల్పించామని, ఇందుకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10 ఫ్లయింగ్‌స్క్వాడ్, 10 స్టాటిస్టిక్ సర్వేలైన్స్, 4 వీడియో సర్వేలైన్స్, 3 వీడియో పరిశీలన, 4 సహాయ ఖర్చుల పరిశీలకులు, 3 అకౌంటింగ్ బృందాలు, 1 ఎంసీఎంసీ, 1 కంట్రోల్‌రూం, ఖర్చుల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. సీ–విజిల్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరిస్తామని, ఈ యాప్‌ను ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు. అక్టోబర్ 31వరకు ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, సురేష్ పాల్గొన్నారు.

బోగస్ బోనఫైడ్ సర్టిఫికెట్లతో పోలీసు కొలువులు..?

బెల్లంపల్లి: బోగస్ బోనఫైడ్ సర్టిఫికెట్లతో కొందరు యువకులు పోలీసు ఉద్యోగాలు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల జిల్లాకు చెందిన కొందరు కుమురంభీం జిల్లాలో మూసివేతకు గురైన ఓ ప్రైవేటు పాఠశాలలో చదివినట్లు బోనఫైడ్ సర్టిఫికెట్లు తీసుకుని ఉద్యోగం సాధించినట్లుగా తెలుస్తోంది. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాలు వెల్లడైన విషయం తెలిసిందే. అనేక మంది అర మార్కు, మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారు. ఉత్తీర్ణత సాధించిన యువకుల వివరాలను కొందరు ఆరా తీయగా నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్ల వ్యవహారం బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్లతో ఉద్యోగం సాధించిన యువకుల్లో బెల్లంపల్లి, తాండూర్ మండలాలకు చెందిన దాదాపు 15మంది ఉన్నట్లుగా చర్చ జరుగుతోంది. వీరిలో ఓ యువకుడు ఇప్పటికే ఏఆర్ పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. సదరు యువకుడు తాజాగా వెలువడిన ఫలితాల్లో ఆసిఫాబాద్ స్థానికతపై పోలీసు ఉద్యోగం సాధించినట్లుగా తెలుస్తోంది. కుమురంభీమ్ జిల్లాలో ఉద్యోగాల సంఖ్య అధికంగా ఉండడం, అర్హులు అంతంత మాత్రంగా ఉన్నట్లు గ్రహించిన బెల్లంపల్లి, తాండూర్ మండలాల యువకులు కుమురంభీం జిల్లాలో స్థానికత వర్తించేలా బోగస్ బోనఫైడ్ సర్టిఫికెట్లు సృష్టించినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంపై కొందరు అభ్యర్థులు పోలీసు ఉన్నతాధికారులకు ఉప్పందించినట్లుగా తెలుస్తోంది. కుమురంభీ జిల్లా పోలీసు యంత్రాంగం బోగస్ బోనఫైడ్ సర్టిఫికెట్లు జత చేసి ఉద్యోగం సాధించిన యువకులపై గుట్టుగా విచారణ చేస్తున్నట్లు వినికిడి.

అవకతవకలపై ఆరా..!

సాక్షి ఎఫెక్టు...

తిర్యాణి: 'మంచిర్యాల జిల్లా వాసులకు ఉద్యోగాలు' శీర్షికన కుమురంభీం జిల్లా 'సాక్షి'లో ఈ నెల 9న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించినట్లు సమాచారం. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన కొందరు అభ్యర్థులు కుమురంభీం జిల్లాలో చదివినట్లు ఓ పాఠశాల నుంచి బోగస్ స్టడీ సర్టిఫికెట్లు తీసుకుని ఉద్యోగం సాధించడంపై వచ్చిన ఆరోపణలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. స్థానికతపై వస్తున్న ఆరోపణలపై అటు మంచిర్యాల జిల్లాతోపాటు కుమురంభీం జిల్లాలో ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలిసులు ఆరా తీసి విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దడం అభినందనీయం

బెల్లంపల్లి: జోనల్ స్పోర్ట్స్ మీట్ కోసం క్రీడా ప్రాంగణాన్ని కొద్ది రోజుల్లోనే ఆధునికంగా తీర్చిదిద్దడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ రాష్ట్ర స్పోర్ట్స్ అధికారి జే.రామ్‌లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర గురుకుల సీఓఈని సందర్శించారు. స్పోర్ట్స్ అధికారి, గేమ్స్ మీట్ ఓవరాల్ ఇంచార్జీ ప్రసాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో కొప్పుల స్వరూపారాణితో కలిసి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై క్రీడల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 16వరకు నిర్వహించే పోటీల విజయవంతానికి అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, కాసిపేట బాలుర, బెల్లంపల్లి బాలికల గురుకులాల ప్రిన్సిపాల్‌లు సంతోష్‌కుమార్, స్వరూప, పీఈటీ, పీడీలు వామన్, రవి, శ్రీధర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అధికారి రామ్‌లక్ష్మణ్, ఆర్సీవో స్వరూపారాణి

క్లుప్తంగా

గుడుంబా విక్రేతపై కేసు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో కాలనీకి చెందిన నవీన్ 10లీటర్ల గుడుంబా అమ్ముతుండగా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గుడుంబా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



భాస్కర్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆసిఫాబాద్‌లోని బజార్‌వాడీకి చెందిన రాచబత్తుల భాస్కర్ (51) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓటీ సంస్థల్లో వోల్వో ఆపరేటర్‌గా పని చేసే భాస్కర్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య పదేళ్ల క్రితమే భాస్కర్‌ను వదిలేసి పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. అప్పటినుంచి మద్యానికి మరింత బానిసైన భాస్కర్ ఆసిఫాబాద్‌లో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కాగజ్‌నగర్ జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా ఆసిఫాబాద్‌కు చెందిన భాస్కర్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

మంచిర్యాలక్రైం: ఈ నెల 6న హమాలీవాడకు చెందిన మల్యాల రామకృష్ణ (40)ను మద్యం మత్తులో నలుగురు యువకులు హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్యకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ భార్య శారద ఫిర్యాదు మేరకు ముందుగా మద్యం మత్తులో కిందపడి మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పోస్టుమార్టం రిపోర్టులో కొట్టిన దెబ్బలతో మృతి చెందినట్లు తేలగా హత్య కేసుగా పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టారు. హమాలీవాడకు చెందిన ఆకుల ప్రణీత్, టాకూర్ జగన్, పవర్ యోహాన్, రెడ్డికాలనీకి చెందిన భూక్య సారయ్య మద్యం మత్తులో రామకృష్ణను హతమార్చినట్లు పేర్కొన్నారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఉద్యోగులకు ప్రమోషన్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో 2023లో యాక్టింగ్ చేస్తున్న ఉద్యోగులకు యాజమాన్యం వివిధ రకాల ప్రమోషన్లు కల్పించనున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఉన్న ఖాళీలను ప్రస్తుతం యాక్టింగ్ చేస్తున్న ఉద్యోగులు, అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. టీబీజీకేఎస్ సింగరేణి యాజమాన్యంతో చర్చించి ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించేందుకు కృషి చేసిందని తెలిపారు. దీంతో ఏరియాలో ప్రధానంగా పంపు ఆపరేటర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీజర్, ఆఫీస్ అటెండెంట్, రికార్డు అసిస్టెంట్, హోమ్ మజ్దూర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్, స్టోర్ ఇష్యూ మజ్దూర్ లాంటి ఖాళీలను యాజమాన్యంతో చర్చించి సాధించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు వీలైనంత త్వరగా ప్రమోషన్లు ఇప్పించనున్నట్లు వివరించారు.

పండుగకు ప్రత్యేక బస్సులు



మంచిర్యాల డిపోలో బస్సులు

- ఆదిలాబాద్ రీజియన్ నుంచి 443..
- అక్టోబర్ 13నుంచి 23వ తేదీ వరకు..
- దసరా, బతుకమ్మకు ఆర్టీసీ సన్నద్ధం

మంచిర్యాలఅర్బన్: నష్టాల్లో ఉన్న సంస్థను గట్టెక్కించేందుకు ఆర్టీసీ యాజమాన్యం అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ప్రస్తుతం దసరా, బతుకమ్మ పండులకు స్పెషల్ బస్సులు నడిపేందుకు సన్నద్ధమైంది. ఇటీవలి కాలంలో ఆర్టీసీ ఆదాయం క్రమంగా పెరుగుతోంది. అక్టోబర్ 13నుంచి 24వ తేదీ వరకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులపై దృష్టి సారించింది. పండుగ రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి డిపోల వారీగా రాజధానికి ప్రత్యేక బస్సులు తిప్పనుంది. అక్టోబర్ 13నుంచి 23వ తేదీ వరకు ఆదిలాబాద్ రీజియన్ నుంచి 443 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళికలు చేపట్టింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి జిల్లాలోని సొంత ప్రాంతాలకు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు వచ్చి వెళ్లనున్నారు. ప్రయాణికులకు నిరంతరం అందుబాటులో ఉండేలా జూబ్లీ బస్టేషన్‌లో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఇద్దరు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తూ సమాచారాన్ని ఇవ్వనున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు రాకపోకలు సాగించనున్నాయి.

డిపోల వారీగా స్పెషల్ బస్సులు

ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి పండుగ స్పెషల్ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 134 బస్సులు, ఆదిలాబాద్ నుంచి 96, మంచిర్యాల నుంచి 95, ఆసిఫాబాద్ నుంచి 81, భైంసా నుంచి 32, ఉట్నూర్ నుంచి ఐదు స్పెషల్ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు యాజమాన్యం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
– రవీంద్రనాథ్, మంచిర్యాల డిపో మేనేజర్

అయా తేదీల్లో డిపోల వారీగా వేసిన బస్సుల వివరాలు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
14	6	4	12	1	6	5	34
15	7	3	10	-	4	8	32
16	7	3	10	-	7	5	32
17	7	3	10	-	6	5	31
18	7	3	10	-	6	5	31
19	7	3	10	-	6	5	31
20	15	3	18	11	22	-	69
21	16	3	21	1	12	21	74
22	12	3	14	1	10	10	50
23	5	1	5	-	5	4	20

నల్లబ్యాడ్జీలతో నిరసన



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సమస్యలు పరిష్కరించాలని ట్రేడ్స్‌మెన్లు నిరసన తెలిపారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ట్రేడ్స్‌మెన్ సబ్ కమిటీ నాయకులు గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి, గనుల మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. అన్ని గనులపై నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాజీ సైదా, కే వీరభద్రయ్య మాట్లాడారు. సింగరేణిలో ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లకు మెడికల్ అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సేమ్ జాబ్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కంపెనీ జారీ చేసిన సర్క్యులర్ కేవలం వన్ టైం మెజర్ కింద సేమ్ జాబ్ కల్పిస్తామని ఉత్తర్వులో ఉందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇది ఎప్పుడు కొనసాగేలా ప్రత్యేక ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. ఆయా గనులపై జరిగిన కార్యక్రమాల్లో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శులు కొట్టె కిషన్‌రావు, ఎం.కొమురయ్య, నాయకులు ఆకుల లక్ష్మణ్, సంపత్‌రావు, ప్రసాద్‌రెడ్డి మురళీచౌదరి, తవటం మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొలిక్కిరానున్న ఎస్పీఎం కార్మికుల సమస్య

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ కాగితం మిల్లు (ఎస్పీఎం) కాంట్రాక్ట్ కార్మికుల సమస్య కొలిక్కి రానుంది. ఎట్టకేలకు పాత బకాయిల చెల్లింపునకు యాజమాన్యం సన్నాహాలు ప్రారంభించింది. మిల్లు మూతపడక ముందు అందులో పని చేసిన కాంట్రాక్ట్ కార్మికుల జాబితాను మంగళవారం మిల్లు యాజమాన్యం విడుదల చేసింది. 2012–13 సంవత్సరంలో మిల్లులో 1,682 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేసినట్లు వెల్లడించింది. 2014 సెప్టెంబర్ 27న మిల్లు మూతపడగా, 2018 ఆగస్టు 2న పునరుద్ధరించారు. మిల్లు మూతబడిన సమయంలో ప్రతీ కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.35వేల చొప్పున చెల్లించేందుకు యాజమాన్యం, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. ఇందుకు కాంట్రాక్ట్ కార్మికులకు దాదాపు రూ.6కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎస్పీఎం యాజమాన్యం మొదటి విడతగా రూ.3 కోట్లు మంజూరు చేయగా, ఆ డబ్బులను బుధ, గురువారాల్లో చెల్లించేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. 2012–13లో 120కి పైగా హాజరుశాతం ఉన్న కార్మికుడికి రూ.20వేలు, అంతకంటే తక్కువగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడికి రూ.10వేల చొప్పున చెల్లించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ముందు, తర్వాత చెల్లించే విషయంలో స్పష్టత కరువైంది.

సొంతింటి పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్కే 7గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 40 ఏళ్ల సంస్థలో పనిచేసినా సొంతగా ఇంటిని నిర్మించుకోవడానికి స్థలం కొనలేకపోతున్నారని తెలిపారు. సింగరేణి వద్ద వందల ఎకరాల మిగులు భూమి ఉందని ఇందులో కార్మికులకు సొంతింటి పథకం కింద రెండు గుంటల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2022లో ఐదు జాతీయ సంఘాలు గుర్తింపు సంఘం కలిసి తొమ్మిది డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వీటిని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానిక్ సూపర్‌వైజర్లు, ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్లు, ఈపీ ఆపరేటర్లు మెడికల్ అండ్ ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని ఒప్పందం జరిగినా దానిని అమలు చేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, కలవేని శ్యాం, భీంరావు, నాయకులు చంద్రమోహన్, శ్రీకాంత్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

బెల్లంపల్లి: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు మంగళవారం పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని తనిఖీ చేయగా ఓ యువకుడి వద్ద 630 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.17వేల వరకు ఉంటుంది. నిందితుడు మందమర్రికి చెందిన మార్నె అనిల్‌గా గుర్తించగా, మరో నిందితుడు మైనర్ అని పోలీసులు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తెచ్చి బెల్లంపల్లి ప్రాంతంలో అధిక ధరకు యువకులకు విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై రవికుమార్, పోలీసులు



పోలీసుల అదుపులో నగదుతో నిందితులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో నస్పూర్ పోలీసులు రూ.5.50 లక్షల నగదు పట్టుకున్నారు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నస్పూర్‌కు చెందిన మునిగంటి కార్తీక్ బైక్‌పై రూ.5.5లక్షల నగదును నస్పూర్ నుంచి మంచిర్యాలకు తీసుకువెళ్తున్నాడు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేసి తదుపరి విచారణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

జన్నారం మండల కేంద్రంలో..

జన్నారం: మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కొప్పుల భూపతి, శ్రీరాముల కృష్ణకాంత్ వద్ద రూ.2లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు వారి వద్ద లేకపోవడంతో ఈ మొత్తాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎంపీవో రమేశ్ ఆధ్వర్యంలో పంచనామా చేశారు. పట్టుబడిన డబ్బులను ట్రెజరీలో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.50వేల కన్నా ఎక్కువ డబ్బులు తీసుకువెళ్లేటపుడు సంబంధించిన బిల్లులు వెంట ఉంచుకోవాలని సూచించారు.

రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలో..

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా రూ.1.98 లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ నరేందర్ తెలిపారు. ఒకరి వద్ద రూ.1.33లక్షలు, మరొకరి వద్ద రూ.65వేలు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి వద్ద తగిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్సై చంద్రశేఖర్, ఎంపీవో అమ్జద్‌పాషా తదితరులున్నారు.

'గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ వైపే..'



మాణిక్యంను సన్మానిస్తున్న బొజ్జు

జన్నారం: గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ధీమా వ్యక్తంజేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మేకల మాణిక్యంను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం బొజ్జు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు సుభాష్‌రెడ్డి, రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, రాజమల్లు, లక్ష్మీనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

12న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఈ నెల 12న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్–19 కబడ్డీ ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లా కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబురావు ఓ ప్రకటనలో తెలిపారు. 1.1.2005 తర్వాత జన్మించినవారు అర్హులని, బోనఫైడ్, ఆధార్ కార్డు వెంటతీసుకురావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849922445 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భూమి ఆక్రమిస్తున్నారని గ్రామస్తుల ఆందోళన



ఆక్రమణను అడ్డుకుంటున్న స్థానికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలో మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసేందుకు పలువురు యత్నిస్తున్నారని గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. హాజీపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేశ్‌కుమార్ తన సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి స్థలం చదును పనులు నిలిపివేయించారు. ఇరువర్గాలను స్టేషన్‌కు రావాలని సూచించారు. కబ్జాపై నంనూర్ గ్రామస్తులు మాట్లాడుతూ.. నంనూర్ పునరావాస కాలనీకి గుడిపేట శివారులోని 300 సర్వే నంబర్‌లో స్థలాన్ని కేటాయించారని తెలిపారు. జాతీయ రహదారి–63కు ఆనుకుని ఉన్న ఈ స్థలంలోని మూడెకరాలను మార్కెట్‌కు కేటాయించారని పేర్కొన్నారు. అయితే ఈ స్థలంపై కొంతమంది రియల్టర్ల కన్ను పడటంతో రెవెన్యూలోని లోపాలను ఆసరాగా చేసుకుని మంత్రి మనుషులమంటూ కబ్జాకు తెరలేపారని తెలిపారు. ఆ భూమి తమదేనంటూ మ్యాప్ తయారు చేయించుకుని కొన్ని పత్రాలు సృష్టించారని ఆరోపించారు. వాటితో కోర్టు నుంచి ఆర్డర్స్ తీసుకువచ్చి భూమి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. కబ్జా యత్నం చేస్తున్న వారి భూమి వారి అంచనా మేరకు బెటాలియన్ వెనుక ఉంటుందని, కానీ మార్కెట్ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. అధికారులు స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న 'గుర్తింపు' ఎన్నికల ప్రక్రియ



నేతలతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎన్నికల్లో పోటీ చేస్తున్న కార్మిక సంఘాలకు గుర్తులు కేటాయించారు. ఈ నెల 6, 7 తేదీల్లో కార్మిక సంఘాలు నామినేషన్లు వేశాయి. 9న విత్‌డ్రా ఉండగా ఎవరూ ఉపసంహరించుకోలేదు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు పోటీలో ఉన్న 14 కార్మిక సంఘాలతో హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో సమావేశమై గుర్తులు కేటాయించారు. సమావేశానికి కంపెనీ నుంచి ప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 30న కంపెనీ ఓటరు జాబితాను అందించాల్సి ఉండగా అందించలేదు. ఎన్నికలు ఇప్పుడు నిర్వహించడానికి వీలు కాదంటూ కంపెనీ ఇటీవల హైకోర్టు ఫుల్‌బెంచీని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై నేడు తీర్పు రానుంది. అంతే కాకుండా ఓటరు జాబితా ఇవ్వకుండా కంపెనీ ఎన్నికలకు సహకారం అందించడం లేదంటూ రిటర్నింగ్ అధికారి కూడా హైకోర్టులో కేసు వేశారు. దీంతో నేడు వచ్చే కోర్టు తీర్పు ఆధారంగా ఎన్నికలు ముందు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతాయా? లేదా.. వాయిదా పడుతాయా? అన్నది తేలనుంది.

'ఎన్నికలు జరగకుండా కుట్ర'

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య ఓ ప్రకటనలో ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న ఉన్నాయని, దీని కంటే ముందే రిటర్నింగ్ అధికారి గుర్తింపు సంఘం ఎన్నికలు అక్టోబర్ 28న నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. దీని ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల పేరుతో సింగరేణి ఎన్నికలు అడ్డుకోవడం సరికాదని తెలిపారు. సింగరేణి ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించే బాధ్యత కంపెనీ, ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

చేనేత కుటుంబానికి పరామర్శ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు బోగ మొగిలి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా అతడి కుటుంబాన్ని మంగళవారం పద్మశాలీ నాయకులు పరామర్శించారు. తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కే మురళి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి మొగిలి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మొగిలి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. దీంతో వారు మొగిలి భార్యకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా తక్షణసాయంగా రూ.25వేలు అందించారు. రాష్ట్ర, జిల్లా సంఘం ద్వారా రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేస్తామని తెలిపారు. పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, నాయకులు గడ్డం సుధాకర్, హాజీపూర్ మండలాధ్యక్షుడు సాంబారి కుటుంబరావు, వొడ్నాల శ్రీనివాస్, అంకం కృష్ణమూర్తి, మారుతి, గడ్డం వెంకటేశ్, రాజగురువయ్య, నీలి శ్రీనివాస్, బండి రాజలింగు, వీరస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రధాని బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించి, 18 కులాలకు రూ.13వేల కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. అన్ని కుల సంఘాలు, చేతివృత్తుల వారు పథకాన్ని ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మోదీ ఆశిస్తున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బోయిని హరికృష్ణారావు పాల్గొన్నారు.

ఐటీఐ స్థలం కబ్జాకు యత్నం




కందకాన్ని పూడ్చివేయిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోకి అక్రమార్కులు చొచ్చుకువచ్చారు. ఐటీఐ స్థలాన్ని కబ్జా చేసి ప్రహరీ నిర్మించేందుకు కందకం తీశారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ చందర్, సిబ్బంది అడ్డుకున్నారు. ప్రహరీ లేక స్థలాన్ని దర్జాగా కబ్జా చేస్తున్నారని తెలిపారు. కాగా, ఐటీఐ స్థలాన్ని పరిరక్షించాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఐటీఐ ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. సంఘం నాయకులు గోపాల్, సల్మాన్, శశి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సూటబుల్ జాబ్ కేటాయించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో ట్రేడ్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో అండర్ గ్రౌండ్ మెడికల్ అన్‌ఫిట్ అయినవారికి సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కేటాయించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు చిప్పనర్సయ్య, మల్లేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, తిరుపతిగౌడ్, వెంకటస్వామి, సంపత్ తదితరులున్నారు.

డీఈవో కార్యాలయం తరలింపు



హరిజనవాడ పాఠశాల భవనం (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: జిల్లాల విభజన తర్వాత స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని భవనంలో నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని తరలించారు. బుధవారం నుంచి సమీకృత కలెక్టరేట్‌లో కేటాయించిన ఎస్–17 భవనం(గది)లో కార్యకలాపాలు కొనసాగనున్నాయి. 2016 అక్టోబర్ 11న డీఈవోగా రవికాంత్‌రావు మొదట బాధ్యతలు చేపట్టారు. మధ్యలో నాలుగు నెలలపాటు రాహుల్ రాజ్ ఐఏఎస్ అధికారి డీఈవో బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఏడాది మే 5 డీఈవోగా యాదయ్య బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత భవనం నుంచి కలెక్టరేట్‌కు కార్యాలయాన్ని తరలించారు. డీఈవో కార్యాలయం కొనసాగిన ప్రస్తుత (పాఠశాల) భవనాన్ని ఎమ్మార్సీతోపాటు పలు విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది.

స్టేషన్‌రోడ్ పాఠశాల తరలించేనా..?

విద్యార్థులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోనే సర్కారు పాఠశాలలు ఏర్పాటు చేసిన అధికారుల అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారుతున్నాయి. వెనకాముందు ఆలోచించకుండా అన్నింటినీ ఒకేచోటకు తరలించారే గాని సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. బైపాస్‌రోడ్‌లోని హరిజన వాడ పాఠశాలలో మూడు భవనాలు, నాలుగు గదులు.. ఐదు తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో స్టేషన్‌రోడ్, రాళ్లపేట్, ఎమ్మార్సీ కార్యాలయాన్ని వివిధ కారణాలతో ఇక్కడికి తరలించారు. అప్పటి నుంచి విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. ఒకే గదిలో ఐదు తరగతుల బోధన సాగడంతో పాఠాలు అర్థం కాని పరిస్థితి. స్టేషన్‌రోడ్ పాఠశాల, రాళ్లపేట్ పాఠశాల విద్యార్థులు కొందరు ఆటోల్లో వస్తుండగా, మరికొందరిని తల్లిదండ్రులు దింపి వెళ్తున్నారు. ఆటోల్లో వచ్చి వెళ్లడానికి నెలకు దూరాన్ని బట్టి సుమారు రూ.300 నుంచి రూ.700 ఖర్చు చేస్తున్నారు. ఈ పాఠశాలలు దూరంగా ఉండడమే విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. స్టేషన్‌రోడ్ పాఠశాలను బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చాలనే ప్రతిపాదనగానే మిగిలిపోతోంది. ఎమ్మార్సీ కార్యాలయం తరలిస్తున్న బాలుర ఉన్నత పాఠశాల భవనంలోకి స్టేషన్‌రోడ్ పాఠశాల తరలిస్తే ఆ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.